క్లుప్తంగా

గ్రామాలు ప్రశాంతంగా ఉండాలి



ప్రత్తిపాడు: గ్రామాలు ప్రశాంతతకు చిహ్నాలుగా ఉండాలని గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ జి.భానూదయ అన్నారు. ప్రత్తిపాడు మండలం వంగిపురంలో ఎస్ఐ కె.నాగేంద్ర ఆధ్వర్యంలో శనివారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన డీఎస్పీ భానూదయ మాట్లాడుతూ.. పొలం గట్లు, స్థలం హద్దు వివాదాలు ఉంటే వాటిని చట్టానికి లోబడి, ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. ఏ సమస్య ఉన్నా.. స్థానిక స్టేషనులో న్యాయం జరగలేదని భావించినా.. నేరుగా తనకు ఫోన్ చేయవచ్చని డీఎస్పీ ప్రజలకు వివరించారు. మండల పరిధి పాతమల్లాయపాలెంలో సీఐ జి.శ్రీనివాసరావు పల్లె నిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. వివాదాలు, కేసులు, చట్టాలు, శిక్షలు.. వంటి అనేక అంశాలపై సీఐ మాట్లాడారు. మైనర్ బాలలకు తల్లిదండ్రులు తమ వాహనాలను ఇవ్వవద్దని సూచించారు. కార్యక్రమాల్లో సిబ్బంది పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప సభ

చేబ్రోలు: మన సైనికుల పరాక్రమంతో సరిహద్దులు సురక్షితంగా ఉన్నాయని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆరె వెంకట్రావు అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప సభను నిర్వహించారు. ప్రధాని మోదీ 11 ఏళ్ల పరిపాలనలో పేదల అభ్యున్నతికి కృషి చేశారని దీని దృష్ట్యా అన్ని మండలాల్లో వికసిత్ భారత్ సంకల్ప సభలు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నారిశెట్టి శ్రీరామచంద్రమూర్తి, సీహెచ్ చంద్రశేకర్, పి.శ్రీనివాస్, పవన్‌రెడ్డి, జూటూరి మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం

పెదకాకాని: ఆయుర్వేద వైద్యం ద్వారా ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు, చైర్మన్ డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు అన్నారు. పెదకాకాని మండలం అగతవరప్పాడు ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయుర్వేద పంచకర్మ వైద్యం కోసం కేరళ వెళ్లాల్సిన అవసరం లేకుండా అగతవరప్పాడు సమీపంలో అన్ని సౌకర్యాలతో 100 పడకల ఆసుపత్రి స్థాపించామని అన్నారు. ఆయుర్వేద వైద్యం గొప్పతనాన్ని, ప్రయోజనాలను వివరించారు. ఈ శిబిరం ద్వారా 150 మందికి నాడీ పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. వైద్య బృందం డాక్టర్ భాను కశ్యప్, డాక్టర్ మోనిక, డాక్టర్ రాహుల్ చంద్ర, మేనేజర్ మల్లేశ్వరి, థెరపిస్టులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

ప్రత్తిపాడు: పోరాటాలతోనే హక్కులను సాధించుకోగలమని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ తోడేటి ఏసుపాదం అన్నారు. పెదనందిపాడు మండలం కొప్పర్రులో ఆదివారం గ్రామ కమిటీ ఎన్నికను నిర్వహించారు. గ్రామ కన్వీనర్‌గా మన్నవ రవితేజ, కో కన్వీనర్‌గా మన్నవ సుబ్బులను ఎన్నుకున్నారు. ఏసుపాదం మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకూ మాదిగల హక్కుల సాధనకు అనేక సార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై రాజీలేని పోరాటం చేసిందన్నారు. రాష్ట్ర నాయకుడు కారుమూరు అంకయ్య, మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రత్తిపాడు: పెదనందిపాడు మండలం అన్నపర్రులో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కామ్రేడ్ కొల్లా కొండలరావు హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో వైద్యులు డాక్టర్ చెరుకూరి పవన్‌కుమార్, జి.సాయికృష్ణ, కె.వంశీకృష్ణ, భానుతేజ, పి.చాణక్య, వై.రామకిషోర్, ఎస్.వేణులు పాల్గొని ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో డీవీసీ, శ్రేయాస్, పవన్ న్యూరో, కృష్ణ స్కిన్ సెంటర్, రమేష్, సాయిరత్న అమరావతి కంటి వైద్యశాలలు వైద్యసేవలు అందించాయి. తొలుత శిబిరాన్ని కొల్లా పద్మశ్రీ ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కె.ప్రసాద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

తెనాలిరూరల్: విజయవాడ–తెనాలి రైలు మార్గంలో కొలకలూరు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని పురుష మృతదేహాన్ని రైల్వే పోలీసులు ఆదివారం కనుగొన్నారు. మృతుని వయస్సు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటుందని.. మృతదేహం ఛిద్రమైందని.. సమాచారం తెలిసినవారు తెనాలి జీఆర్పీ పోలీసులను సంప్రదించాల్సిందిగా ఎస్ఐ వెంకటాద్రి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

- పంటల సాగులో వైవిధ్యం చూపితే అనేక ప్రయోజనాలు
- తెగుళ్ల నివారణ అధిక దిగుబడులకు అవకాశం
- తరచూ ఒకే పంట వేయడంతో చీడపీడల ఉధృతి అధికం



వెంకటకృష్ణాపురంలో రైతు సిద్ధం చేసిన పొలం

పెదకాకాని: పొలంలో ప్రతిసారి వేసిన పంటనే మళ్లీ వేయడంతో దిగుబడి తగ్గడంతో పాటు తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుంది. అలా కాకుండా ఏటా పంట మార్పిడి పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఒకేరకం కాకుండా అనేక రకాల పంటలను క్రమపద్ధతిలో సాగుచేస్తే అధిక ప్రయోజనాలు పొందవచ్చని చెబుతున్నారు. పంటమార్పిడి చేయడం ద్వారా ప్రకృతి వనరులను సైతం సమర్థవంతగా వినియోగించవచ్చు. తక్కువ పెట్టుబడితో భూసారానికి నష్టం కలుగకుండా అధిక దిగుబడులు సాధించవచ్చు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ సాగుకు సిద్ధమైన అన్నదాతలు పంట మార్పిడి ఆవశ్యకతపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

ఒకే తరహా పంట సాగుతో నష్టాలు..

ఏటా ఒకే రకం పంట పండించడం వల్ల చీడపీడలు, కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. పైరు కూడా అభివృద్ధి చెందదు. దిగుబడులు తగ్గుతాయి. రైతులకు పెట్టుబడి భారం పెరుగుతుంది. వేరు వ్యవస్థ ఒకే లోతుకు పోవడం వల్ల నేలలో ఆ లోతు వరకు ఉన్న పోషకాలను మాత్రమే మొక్కలు వినియోగించుకుంటాయి. నేల కోతకు గురవుతుంది. పండిన పంట నాణ్యతగా ఉండదు. ఫలితంగా గిట్టుబాటు ధర లభించదు. దీంతో రైతులకు నష్టం వచ్చే అవకాశం ఉంది. మార్కెట్ సమస్యలు కూడా ఎదురవుతాయి. అందుకే వేర్వేరు పంటలను సాగు చేసుకోవాలి.

పంట మార్పిడితో భూసారం వృద్ధి..

వరి పంట సాగుచేసే ముందు పచ్చిరొట్ట పైర్లు సాగు చేయడం వల్ల భూసారం పెరిగి సేంద్రియ పదార్థం భూమిలో ఎక్కువగా ఉండటంతో పైరు ఏపుగా పెరుగుతుంది. వరి తరువాత అపరాలు పంట పైరు సాగు చేయడం వల్ల భూమిలో సేంద్రియ పదార్థం బాగా వృద్ధి చెందుతుంది. దీంతో పంటపై వచ్చే శిలీంధ్రాల ఉధృతి తగ్గుతుంది. వరి తరువాత గింజ జాతికి చెందిన శెనగ, పెసర, మినుము, వేరుశెనగ వంటివి సాగు చేయడంతో వాటి వేర్లలోని రైజోబియస్ బ్యాక్టీరియా గాలిలోని నత్రజనిని తీసుకుంటుంది. వేర్లలో బొడిపెల మాదిరిగా ఏర్పడి తర్వాత సాగు చేసే పంటలకు మంచి సారాన్ని అందిస్తాయి.

పంట మార్పిడితో మంచి దిగుబడులు..



ఏటా ఒకే రకం పంట సాగు చేయకుండా పంట మార్పిడి పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. ప్రస్తుతం చాలా మంది రైతులు తమ పొలాల్లో ఒకే రకం పంటను తరచూ సాగు చేస్తున్నారు. నీటి పారుదల ఉన్నచోట వరి తప్ప ఇతర పంటలు వేయడం లేదు. దీంతో వరిలో చీడపీడల బెడద ఎక్కువై సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. దీన్ని నివారించేందుకు పంట మార్పిడి విధానం చాలా ఉత్తమం. రైతులు విధిగా పంట మార్పిడి చేపట్టాలి.

– పి.సంధ్యారాణి, మండల వ్యవసాయ అధికారి, పెదకాకాని

సూపర్ సిక్స్ వాగ్దానాల అమలుపై పోరాటం



మాట్లాడుతున్న హనుమంతురావు

పెదకాకాని: ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చే వరకూ పోరాటాలు కొనసాగుతూనే ఉంటాయని గుంటూరు జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతురావు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ గ్రామ మహాసభను ఆదివారం పెదకాకానిలో నిర్వహించారు. సమావేశానికి పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన హనుమంతరావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలన్నింటినీ అమలు చేయాలన్నారు. ప్రజల కనీస అవసరాలైన తాగునీరు, మురుగు పారుదల వంటి వాటిపై వర్షాకాలంలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. అనంతరం మహాసభలో ఏకగ్రీవంగా పాటిబండ్ల డేవిడ్ రాజును గ్రామ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రెంటాల కుమారి, మండే రవీంద్రబాబు, శరత్‌బాబు, గొడ్డంటి రమణకుమార్, దర్శి లింగారావు, రామిశెట్టి శ్రీనివాసరావు, బొట్టు నాగేశ్వరరావు, సీహెచ్ విజయలక్ష్మి, గిరిజ, వినీత, దేవిక తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ నిరులలో యోగా డే



యోగా శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

గుంటూరు రూరల్: మండలంలోని పెదపలకలూరు పరిధి విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఇంటర్నేషనల్ యోగా డే సందర్భంగా ఆంధ్రప్రదేశ్ యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని 850 మంది విద్యార్థులకు ఆయుష్ డిపార్ట్‌మెంట్, గవర్నమెంట్ ప్రోటోకాల్ ప్రకారం ఆసనాలను నేర్పించామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక తెలిపారు. ఈశా ఫౌండేషన్ ఇంటర్నేషనల్ యోగా డే సందర్భంగా ఈనెల 21వ తేదీ లోపు 15 నుంచి 20 కార్యక్రమాలు నిర్వహించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు ఫౌండేషన్ సిబ్బంది తెలిపారు. ఆసక్తి గల వారు 98851 98095 నంబరులో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అపూర్వ కలయిక.. ఆనంద వేడుక



1985-86 బ్యాచ్ పూర్వవిద్యార్థులు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం ముట్లూరు సెయింట్ గ్జేవియర్స్ ఉన్నత పాఠశాలలో 1985–86 బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. పూర్వ విద్యార్థులంతా ఒక్కచోట సమావేశం కావడంతో పండుగ వాతావరణం తలపించింది. విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు జి.ప్రేమయ్య, అంతయ్య, యం.జోజయ్య, సుందర్రావు, ఎస్.అప్పారావు, శౌరయ్య, ఇన్నారెడ్డిలను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. తొలుత పరమపదించిన మిత్రుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఒకరి చిరునామాలు మరొకరు తీసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కుంచాల శివయ్య, పాలా శ్రీను, అల్లం శివనాగేశ్వరావు, చట్టు యల్లయ్య, చుక్క ఏలియ, గేరా సత్తయ్య, మొవ్వా సురేష్, రావూరి ఆచారి, ఐనంపూడి అమ్మాజీ, కూరపాటి పద్మజా, ఉండవల్లి వాణి, రజిని, రామాదేవి, ప్రత్తి విజయశ్రీ, గుర్రం సీతారావమ్మా, తదితరులు పాల్గొన్నారు.

మిరప విత్తనాలు అమ్మకానికి సిద్ధం

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో సోమవారం నుంచి మిరప విత్తనాలను అమ్మకానికి సిద్ధంగా ఉంచినట్లు ప్రాంతీయ ఉద్యాన పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ సి.వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌సీఏ 643 రకం, ఎల్‌సీఏ 625, ఎల్‌సీఏ 657 రకం అందుబాటులో ఉన్నాయన్నారు. ఇవి అధిక బెట్టను తట్టుకునే రకాలని.. విత్తనాల కోసం ఆసక్తి గల రైతులు రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు లాంఫాంలో పొందవచ్చని అన్నారు. రెండో శనివారం, ప్రతి ఆదివారం సెలవులని తెలిపారు. కిలో విత్తనాలకు రూ.1,200 చెల్లించాలని ఆయన అన్నారు. వివరాలకు 99898 09554 నంబరును సంప్రదించాలన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

చేబ్రోలు: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీ నారాయణ డిమాండ్ చేశారు. చేబ్రోలులోని ఉపాధ్యాయ భవన్‌లో ఆదివారం సీఐటీయూ మండల సమావేశాన్ని నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జిల్లాలో జూలై 9న దేశ వ్యాప్త సమ్మెను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. యూనియన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా పి.చౌడయ్య, ఎస్ మస్తాన్‌వలి, ఉపాధ్యక్షులుగా రాజారావులను ఎన్నుకున్నారు.

శ్రీసరస్వతీ శిశుమందిర్ ప్రబంధ కారిణి బాధ్యతల స్వీకారం

తెనాలి: స్థానిక సుల్తానాబాద్‌లోని శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో పాఠశాల ప్రబంధకారిణి బాధ్యతల స్వీకరణ కార్యక్రమం ఆదివారం గౌరవ అధ్యక్షుడు కొత్త సుబ్రహ్మణ్యం సమక్షంలో నిర్వహించారు. సంచాలిత సమితి అధ్యక్షుడు డాక్టర్ సామల లక్ష్మణబాబు అధ్యక్షత వహించగా కాకతీయ కో–ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరిస్తున్న కమిటీ అధ్యక్షుడు అవ్వారు లత, కార్యదర్శి యర్రంశెట్టి హనుమంత రావు, కోశాధికారి కొత్త కిరణ్మయి, సభ్యులు గడ్డం శ్రీధర్, దేవతి భాస్కర్‌లను లక్ష్మణబాబు పరిచయం చేశారు. అనంతరం పాఠశాల స్థాపనకు ముఖ్య దాత, ప్రధాన కారకుడు కొత్త సుబ్రహ్మణ్యంను కమిటీ సభ్యులు, మాతాజీలు సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావుకు డాక్టరేట్

తెనాలిటౌన్: స్థానిక ఐతానగర్‌కు చెందిన చీకటి వెంకటేశ్వరరావు హార్ట్ డీసీస్ డిటెక్షన్, ప్రిడిక్షన్ విత్ మెషీన్ లెర్నింగ్ అనే అంశం మీద పరిశోధన చేసినందుకు గాను తమిళనాడు గవర్నమెంట్ అన్నామలై యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసింది. డాక్టర్ వెంకటేశ్వరరావు ప్రస్తుతం కెఎల్ యూనివర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. వెంకటేశ్వరరావుకు డాక్టరేట్ రావడంపై స్నేహితులు డాక్టర్ కృష్ణమోహన్, కోంద్రు కిరణ్‌కుమార్, జి.రవికుమార్, కిషోర్, సోమశేఖర్, శ్రీకాంత్ తదితరులు అభినందనలు తెలిపారు.

కనగాలలో ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ నలీమ్ చిన్మయ్

చెరుకుపల్లి: మానవుని శరీర భాగాల్లో కళ్లు ఎంతో సున్నితమైనవని వాటి పట్ల ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని హాజీ మహ్మద్ ఖాసిమ్ సాహెబ్ అండ్ మహ్మద్ గాలా సాహెబ్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ సమ్మద్ అన్నారు. గుంటూరు పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సమ్మద్ ఆయన తల్లి దోహాజాన్ వారి కళాశాల ప్రాంగణంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సమ్మద్ మాట్లాడుతూ తమ ఎడ్యుకేషన్ సొసైటీ తరపున 2004 నుంచి ఏటా కనగాల పరిసర ప్రాంత ప్రజలకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి కంటి వైద్య పరీక్షలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఆదివారం నిర్వహించిన 25వ కంటి వైద్య శిబిరానికి పెద్ద ఎత్తున జిల్లా నలుమూలల నుంచి వచ్చి కంటి పరీక్షలు చేయించుకోవటం సంతోషం కలిగించిందన్నారు. రానున్న రోజుల్లో భారీ మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామీణ ప్రజలకు హాజీ మహ్మద్ ఖాసిమ్ సాహెబ్ అండ్ మహ్మద్ గాలా సాహెబ్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా సేవలు అందించటం జరుగుతుందని తెలిపారు. ఈ నేత్ర వైద్య శిబిరానికి 260 మంది హాజరు కాగా, 187 మంది కంటి శుక్లాల ఆపరేషన్‌కు ఎంపికయ్యారన్నారు. వారికి పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి వారు ఉచితంగా ఆపరేషన్‌లు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో షేక్ ఫారూక్, శంకర కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక ఆలంకరణలో వేంకటేశ్వరస్వామి



పూజల్లో పాల్గొన్న ప్రజ్ఞానంద సరస్వతి బాలస్వామి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు

బాపట్ల: అంగరంగ వైభవంగా వేంకటేశ్వరస్వామి వారి ఉదయాస్తమాన సేవా మహోత్సవ కార్యక్రమం స్థానిక బాపట్ల సాయిరాం గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగింది. వేంకటేశ్వరస్వామి వారి ఉదయాస్తమాన సేవా మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పెనుగొండ పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి బాలస్వామి నేతృత్వంలో కనులు పండువగా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజ్ఞానంద సరస్వతి బాలస్వామి మాట్లాడుతూ తిరుమలలో శ్రీవారికి సుప్రభాత సేవ నుంచి ఏకాంత సేవ వరకు ఏ విధంగా జరుగుతుందో అదే విధంగా బాపట్లలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం నాయకుడు కొత్తమాసు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని సకాలంలో పంటలు బాగా పండాలని స్వామి వారికి ఇలాంటి సేవలు చేయటం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం స్టేట్ ప్రెసిడెంట్ చిన్ని రామ సత్యనారాయణ, జిల్లా ప్రెసిడెంట్ తూనుగుంట్ల శ్రీనివాసరావు, జిల్లా సెక్రటరీ సంజీవరావు, ఉపాధ్యక్షులు ఉప్పాల సుధాకర్, కోళ్లపూడి శివన్నారాయణ, సభ్యులు పారేపల్లి వెంకట సురేష్, నాలం వేణుగోపాలరావు, తుళ్లూరు రాము, మామిడి రమేష్, కేవీఎస్ ప్రసాద్, శివకుమార్, పొన్నూరు శ్రీనివాసరావు, తుళ్లూరు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ఆధునిక అభ్యుదయ సాహిత్యంలో శ్రీశ్రీ సరికొత్త ప్రభంజనం



శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

బాపట్ల: తెలుగు ఆధునిక అభ్యుదయ సాహిత్యంలో శ్రీశ్రీ సరికొత్త ప్రభంజనాన్ని సృష్టించారని ప్రజా కవి డాక్టర్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. బాపట్ల జమేదారు పేటలోని సాహితీ భారతి కార్యాలయంలో ఆదివారం జరిగిన శ్రీశ్రీ వర్ధంతి సభకు శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాప్రస్థానం, ఖడ్గసృష్టి వంటి కవితా సంపుటాలు నేటికీ తెలుగు కవులలో నూతన స్ఫూర్తిని నింపుతున్నాయన్నారు. సాహితీ భారతి అధ్యక్షుడు రావూరి నరసింహ వర్మ మాట్లాడుతూ శ్రీ శ్రీ 'కదిలేది కదిలించేది పెను నిద్దుర వదిలించేది పరిపూర్ణ బతుకిచ్చేది కావాలోయ్ నవ కవనానికి ' అని ఆధునిక కవిత్వానికి సరికొత్త నిర్వచనం ఇచ్చారన్నారు. సాహితీ భారతి ఉపాధ్యక్షుడు ఎం.మాల్యాద్రి రావు మాట్లాడుతూ శ్రీశ్రీ తన కవిత్వంలో కార్మిక కర్షక జీవితాల కష్టాలు కన్నీళ్లను ఆవిష్కరించారన్నారు. సాహితీ భారతి కోశాధికారి ఆదం షఫీ మాట్లాడుతూ శ్రీశ్రీ దాదాపు 280 చిత్రాలకు వేయికి పైగా పాటలు రచించారన్నారు. ఈ సభలో ఎం.జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, దగ్గు మల్లి శామ్యూల్, బొడ్డుపల్లి శ్రీరామ చంద్రమూర్తి, కాళిదాసు తదితరులు శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా గుడారంకమ్మ కొలుపులు



ప్రత్యేక అలంకరణలో ఉన్న గుడారంకమ్మ

పాతనందాయపాలెం(కర్లపాలెం): చీరాల వారి ఇలవేల్పు గుడారంకమ్మ అమ్మవారి కొలుపులు ఘనంగా జరిగాయి. పాత నందాయపాలెం గ్రామంలో వేంచేసియున్న చీరాల వంశస్తుల ఇలవేల్పు గుడారంకమ్మ వార్షిక కొలుపులు ఈ నెల 11వ తేదీ నుంచి ఆదివారం వరకు వైభవంగా నిర్వహించారు. కొలుపులలో మొదటి రోజు అమ్మవారి పావడి, వీరతాళ్ళు, వీర కత్తులు ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో ఉంచి చీరాల వంశస్తులు పలు ట్రాక్టర్లలో అధిక సంఖ్యలో బాపట్ల సూర్యలంక సముద్ర తీరానికి వెళ్లి పుణ్య స్నానాలాచరించి తిరిగి అమ్మవారి పావడి గ్రామంలోకి తీసుకుని వచ్చి ఐదు రోజులుగా రాత్రి, పగలు కొత్త నందాయపాలెం, పాత నందాయపాలెం, ఏట్రవారిపాలెం గ్రామాలలో కనక తప్పెట్లు, మంగళ వాయిద్యాలతో కొలుపులు నిర్వహించారు. పాత నందాయపాలెం గ్రామంలోని అమ్మవారి ఆలయం వద్ద గుడారంకమ్మ జీవిత చరిత్రను బుర్ర కథ ద్వారా వినిపించారు. మొక్కులు ఉన్న యువకులు బాలవేషం ధరించి గారెలు, నిమ్మకాయల దండలు వేసుకుని కొలుపులలో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఆదివారం అమ్మవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించటంతో కొలుపులు ముగిశాయి.

వృద్ధుల హక్కులపై అవగాహన అవసరం

తెనాలిరూరల్: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో ముఖ్య అతిథిగా ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.వివేక్ వర్ధన్ పాల్గొని వృద్ధులకు ఉన్న హక్కులను, చట్టాలలో వారికి కల్పించిన వెసులుబాటును, చట్టబద్ధంగా వాటి ఉపయోగించే విధానం పై అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ మాట్లాడుతూ వృద్ధులు నిరాదరణకు గురవుతున్న అంశాలను వివరించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్, పెన్షనర్స్ అసోసియేషన్ సహాధ్యక్షుడు జి.సుబ్బారావు, స్వరలయ వేదిక అధ్యక్షుడు లక్కరాజు సాయి, న్యాయ సేవా అధికార సంస్థ సూపరింటెండెంట్ మహబూబ్, పెన్షనర్ల సంస్థ కార్యదర్శి సూర్యప్రకాశరావు, సోమయ్య శాస్త్రి పాల్గొన్నారు.

కనులపండువగా వేంకటేశుని పల్లకీ సేవ



తెనాలిటౌన్: శ్రవణానక్షత్రం సందర్భంగా శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వైకుంఠపురంలో శ్రీ స్వామి అమ్మవార్లకు పల్లకీ సేవ కనులపండువగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వి.అనుపమ మాట్లాడుతూ ప్రతి నెల శ్రవణానక్షత్రం రోజున సాయంత్రం 6 గంటలకు స్వామి, అమ్మవార్లకు పల్లకీ సేవ జరుగుతుందని తెలిపారు. అర్చకులు హారతి ఇచ్చి పల్లకీ సేవను ప్రారంభించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో గణేష్ టీమ్ ప్రతిభ



రేపల్లె: రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ టీమ్ క్రీడాకారులు ప్రతిభ చాటారు. గత పది రోజుల నుంచి కొల్లూరు మండలం అనంతవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొన్న రాజోలు గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి నేతృత్వంలోని డాక్టర్ గణేష్ టీమ్ క్రీడాకారులు రన్నర్‌గా నిలిచారు. ఇటీవల కృష్ణా జిల్లా ఘంటశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి, దూళిపూడిలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో రామకృష్ణారెడ్డి నేతృత్వంలోని టీమ్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా క్రీడాకారులను ఆదివారం డాక్టర్ గణేష్‌తో పాటు, వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందించారు.

పేద విద్యార్థికి ఆర్థికసాయం



తెనాలిటౌన్: వాకర్స్ క్లబ్ తెనాలి–2 ఇరవై సంవత్సరాలు పూర్తి చేసుకున్నట్లు క్లబ్ అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ళ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం వాకర్స్ క్లబ్ తెనాలి–2లో నిర్వహించిన సేవా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవితాన్ని నడక ఎంతో అవసరమన్నారు. క్లబ్ 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అహ్మదాబాద్ విమాన దుర్ఘటన మృతులకు నివాళులర్పించారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు టి.రాజారావు కుటుంబ సభ్యులు పేద విద్యార్థికి రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. జి.విజయసాగర్, డాక్టర్ పి.దీప్తి, జి.మురహరిరావు, భుజంగరావు, సత్యనారాయణరాజు, దేవబత్తుని ఉమామహేశ్వరరావు, తుమ్మల సత్యనారాయణ, విజయ, అనురాధ, జ్యోతి, శ్రీలత, ఝాన్సీలక్ష్మి, జి.ఎల్.ప్రసన్నకుమారి, తదితరులు ఉన్నారు.